రైతు భరోసా లేదు.. బోనస్ రాదు

- దిక్కుతోచని స్థితిలో అన్నదాత
- దాళ్వా సాగుకు ఎదురు చూపు
- ఈ సారి సాగు తగ్గనుందా ?



వరి చేలో రైతు

ఆకివీడు: అన్నదాత మళ్లీ దగా పడ్డాడు. రైతుకు చేదోడు, వాదోడుగా ఉన్న రైతు భరోసాను రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నమ్మి రైతన్నలు మోసపోయారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్నే మరిచిపోయింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్లు ఇచ్చిన రైతు భరోసా, పంటల బీమా సొమ్ములతో రైతులు ఆనందంగా జీవించారు. ఎన్నికల అనంతరం రైతు భరోసా ఇవ్వకపోవడంతో ఖరీఫ్ సాగు భారంగా మారింది. గోరుచుట్టుపై రోకటి పోటుగా అప్పులతో సాగు చేసిన ఖరీఫ్ పంట ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర నష్టానికి గురి చేసింది.

రైతు భరోసా ఎప్పుడు ?

ప్రభుత్వం ఏర్పడే సమయానికి రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పెట్టుబడికి రైతు భరోసా వస్తుందని ఎదురు చూశారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు పీఎం కిసాన్ పథకం విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదు. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు పీఎం కిసాన్ భోరసా పథకం మంజూరు చేస్తుంది. మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున విడుదల చేస్తున్నారు. దీనికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్టుబడుల నిమిత్తం రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500 రైతు భరోసాను ప్రకటించి, ప్రతీ ఏటా రైతులకు పంట సాగుకు ముందే వారి ఎకౌంట్లలో జమ చేసేవారు.

పండిన పంటకు బోనస్ లేదు.

ఖరీఫ్‌లో వరదలు, తూఫాన్ తాకిడికి నష్టపోయి, మిగిలిన పంటను రైతు దక్కించుకొని సాగు చేస్తున్నారు. ఒడిదుడుకులతో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై బోనస్ ప్రకటించ లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు మద్దతు ధర క్వింటాళ్లకు రూ.50 పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ఉదాసీనంగా ఉంది. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు బోనస్ ప్రకటించారు. అన్నదాతను ఆదుకునేందుకు క్వింటాళ్లకు రూ.10 ప్రకటించారు. తదనంతర ప్రభుత్వం మద్దతు ధరపై ధాన్యానికి రూ.50 బోనస్ చెల్లించింది. సీఎంగా పని చేసిన రోజుల్లో చంద్రబాబు ఎప్పుడూ రైతులకు బోనస్ కూడా ప్రకటించ లేదు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం రైతులకు రూ.500 బోనస్ ప్రకటించింది. సన్నాలు సాగు చేసే రైతులకు ఇది వర్తిస్తుందని చెప్పింది. ఒరిస్సాలోని బీజేపీ ప్రభుత్వం ధాన్యం క్వింటాళ్లు రూ.3200 కొనుగోలు చేస్తామని ప్రకటించారు. అక్కడ కూడా మద్దతుల ధర కంటే అదనపు ధర బోనస్ రూపంలో చెల్లిస్తున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో రైతుల పట్ల చిన్నచూపు చూడటంలో ఆంతర్యమేమిటని పలువురు రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోని బీజేపీ, జనసేన నాయకులు సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి ధాన్యం మద్దతు ధరపై కింటాళ్లకు రూ.200 ప్రకటించే విధంగా కృషి చేయాలని పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

సాగు తగ్గే ప్రమాదం

రైతు భరోసా, బోనస్ వంటివి అదనపు సొమ్మును రైతులకు చెల్లించకపోతే రానున్న రోజుల్లో వరి సాగు మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏటా సాగుభూమి తగ్గిపోతుంది. జిల్లాలో గత ఏడాది దాళ్వా సాగు 2,23,500 ఎకరాల్లో చేపట్టారు. ఈ ఏడాది సాగు తగ్గే అవకాశం ఉంది. రైతులు ప్రత్యామ్నాయంగా రొయ్యల, చేపల చెరువుల సాగుకు మళ్లుతున్నారు.

రైతులను ప్రోత్సహించాలి



రైతులను ఆర్థికంగా ప్రోత్సహించాలి. అన్నదాత చేదోడు, వాదోడుగా ఉన్నప్పుడే ఆర్థికంగా నిలబడగలడు. స్వామినాథన్ కమిషన్ సూచనల మేరకు మద్దతు ధర రూ.3600 పైగా ఇవ్వాలి. ఇది ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న మద్దతు ధరపై బోనస్ చెల్లిస్తే రైతుకు కొంత ఊరటగా ఉంటుంది. గత ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడంతో పెట్టుబడులకు కొంత వెసులుబాటు కలిగింది. రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం పని చేస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది.

–మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, ఆకివీడు

బోనస్ చెల్లించాలి



రైతులకు రైతు భరోసా చెల్లించలేని ప్రభుత్వం కనీసం ధాన్యానికి బోనస్ ప్రకటించి ఆదుకోవాలి. కంటి తుడుపుగా మద్దతు ధర ఉంది. స్వామినాథన్ సిఫార్సుల మేరకు లాభసాటి ధర అయినా ఇవ్వాలి. పెట్టబడులు భారీగా పెరిగిపోయాయని, ప్రకృతి వైపరిత్యాలు కూడా తీవ్రంగా ఉన్నతరుణంలో రైతును ఆర్థికంగా ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

–కనుమూరు శ్రీ హరి రాజు, భీమవరం

రైతు భరోసా ఇవ్వండి



కౌలుకు వరి సాగు చేయాలంటే చాలా ఇబ్బంది కరంగా ఉంది. గతంలో ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించింది. దీంతో పెట్టుబడులపై ఊరట కల్గింది. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయేది కౌలు రైతే. ప్రభుత్వం రైతు భరోసా కల్పించి, బోనస్ ప్రకటిస్తే రైతులు, కౌలు రైతులు ఆర్థికంగా నిలబడగలరు.

–బుంగా డేవిడ్, కౌలు రైతు, అజ్జమూరు, ఆకివీడు మండలం

క్లుప్తంగా

ధాన్యం సేకరణకు సన్నద్ధం



వ్యవసాయ అధికారి వి.నారాయణరావు

పాలకోడేరు: ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణ రావు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులను సిద్ధంగా ఉంచినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వరి పైరుకి సంబంధించి ఏ విధమైన తెగుళ్ల లేవని, నీటి ఎద్దడి కూడా లేదని తెలిపారు. దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మండలంలో ఈ-పంట నమోదు పూర్తి స్థాయిలో చేశామని, రైతు సోదరులు తమ పంటను కోసిన వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమకు కావలసిన గోనె సంచులను పొందొచ్చన్నారు. రైతు సోదరులు ధాన్యం తూచిన 24 గంటల లోపు ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయాలనే ధృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా స్త్రీల ఆదివారం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: ప్రతి ఒక్కరూ బైబిల్ నందు అవగాహన కలిగి ఉండాలని డి.మణికుమారి లాజరస్ కోరారు. మొగల్తూరు-2 పేరిస్ నక్కావారిపాలెంలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా స్త్రీల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరిస్ పాస్టర్ తలారి కొండయ్య మోజెష్, మార్టిన్స్, తలారి వాణి, సీఆర్ విల్లూరి లాజర్, బొడ్డుపల్లి సుబ్బారావు, కోనాల ప్రసాదరావు, దీపాటి వెంకటేష్, కొండావారిపేట, గోడావారిపేట, రాజుగారితోట, పాలకమ్మ చెరువు సంఘాలకు చెందిన స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

మొగల్తూరు: కార్తీకమాసం రానుండటంతో శైవ క్షేత్రాలన్నీ ముస్తాబవుతున్నాయి. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం ఆలయాన్ని శుద్ధి చేసి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక ప్రసాద్, కొత్తలంక బాపన్న, జి.ఫణిశాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


పెనుగొండ విద్యార్థుల ప్రతిభ



క్యాట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన పెనుగొండ చైతన్య విద్యార్థులు

పెనుగొండ: జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ (క్యాట్) మొదటి దశలో పెనుగొండ చైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ గణిత విభాగంలో 11 మంది, భౌతిక శాస్త్ర విభాగంలో 15 మంది, రసాయన శాస్త్రంలో 21 మంది ప్రతిభన కనబరిచి రెండో దశకు మొత్తంగా 47 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం పార్థసారధి, జోనల్ కో-ఆర్డినేటర్ రామారావు, డీన్ గణేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

నరసాపురం రూరల్: ఎల్ఐసీ పాలసీదారులకు బోనస్ పెంచాలని, ప్రీమియంపై విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని, కనీస బీమా మొత్తం రూ.1 లక్ష ఉంచాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ కార్యదర్శి పోలిశెట్టి సర్వేశ్వరరావు డి మాండ్ చేశారు. ఎల్ఐసీ మేనేజ్‌మెంట్, ఏజెంట్లు, పాలసీదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఎల్ఐసీ ఏజెంట్లు దేశవ్యాప్తంగా 16 రోజులుగా ధర్నా చేస్తున్నారు. సోమ వారం నరసాపురం స్టీమర్ రోడ్డులోని కార్యాలయంలోని కార్యకలాపాల ను అడ్డుకొని మహా ధర్నా నిర్వహించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె ఒప్పందాల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి వాసుదేవరావు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తవుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. భీమవరం మున్సిపాలిటీలో పర్మిట్ కార్మికుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుందని వారి స్థానంలో కొత్త కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. పట్టణం జిల్లా కేంద్రం కావడంతో కార్మికులకు పనిభారం మరింత పెరిగిందని దానికి అనుగుణంగా కార్మికులను సంఖ్యను పెంచే చర్యలను అధికారులు తీసుకోవడం లేదని విమర్శించారు. యూనియన్ అధ్యక్షుడు నీలాపు రాజు మాట్లాడుతూ సమ్మె కాలం ఒప్పందాలు అమలు చేయాలని, అన్ని డిపార్ట్‌మెంట్స్‌లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. తక్షణం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ నాయకులు బి వరలక్ష్మి, భాను, మోహన్జ, నాని, నీలాపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టై గ్రాడ్ బిజినెస్ ఇండియా టోర్నమెంట్‌లో విష్ణు విద్యార్థుల ప్రతిభ



టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి అందుకుంటున్న విష్ణు విద్యార్థులు

భీమవరం: టై గ్రాడ్ బిజినెస్ ఇండియా టోర్నమెంట్ గ్రాండ్ ఫినాలేలో భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురువేసి ప్రథమ బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు, ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్, మెంటార్ విఎస్ఎన్ నర్సింహరాజు చెప్పారు. పోటీల్లో విజేతలను సోమవారం అభినందించిన సందర్భంగా వివరాలను విలేకర్లకు వివరించారు. తమ కళాశాల విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన టై గ్రేడ్ బిజినెస్ ఇండియా – 2024 టోర్నమెంట్‌లో మొదటి బహుమతిని సాధించారన్నారు. ఈ పోటీలో 112 కళాశాలల విద్యార్థులు పాల్గొనగా విష్ణు కళాశాల విద్యార్థులు గ్రీన్ ఫ్యూషన్ ఐటీ సొల్యూషన్స్ టీమ్ మొదటి బహుమతి సాధించి రూ. లక్ష నగదు బహుమతి అందుకున్నారన్నారు. దీనితో పాటు అమెరికాలో జరిగే సదస్సుకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారని వివరించారు. విజేతలను విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం, డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ప్రసాద్‌రాజు, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 4వ తేదీన నిరసన చేపట్టాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి సుబ్బారావు చెప్పారు.భీమవరం సీఐటీయూ కార్యాలయంలో సోమవారం గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చాలీచాలని వేతనాలు, పని భారంతో వీఆర్ఏలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నైట్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీల పేరుతో అదనపు చాకిరి చేస్తున్నప్పటికీ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా నాయకుడు ఖాదర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం ఆంజనేయులు, ఈ నల్లబ్బాయి పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



ట్రస్ట్ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): సేవ చేయాలన్న మనసు ఉంటే వయసు అడ్డుకాదని, ఎనిమిది పదుల వయస్సులో ఉదయ్యావర్ తిరువది చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నందు ఉదయ్యావర్ తిరువది చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి ట్రస్ట్ కార్యక్రమాలను వివరించారు. భారత అభ్యుత్తాన మంగళ యాత్ర పేరిట ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకు ఉన్న జిల్లాల్లో పర్యటిస్తూ ఆయా జిల్లాల్లో ప్రముఖంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారికి ట్రస్టు ద్వారా సహాయం చేయాలనే లక్ష్యంతో ఉన్నామని జిల్లా కలెక్టర్‌కు ట్రస్ట్ సభ్యులు వివరించారు. జిల్లాలో వాస్తవంగా ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు విద్య, వైద్యం, హాస్పటల్స్ లో మౌలిక సదుపాయాలు, తల సేమియా బాధితులకు రక్త మార్పిడి, వ్యక్తిగత ఇబ్బందులు, తదితర విషయాలలో మా ట్రస్టు ద్వారా సహాయం చేయడానికి ముందున్నామన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మీ అందరినీ చూస్తుంటే 80 ఏళ్ల వయసు పైబడి ఉన్నారని, వివిధ రాష్ట్రాల నుంచి సభ్యులుగా ఉండడం, ఈ వయసులో వివిధ వాతావరణలను తట్టుకుంటూ భారతదేశం మొత్తం తిరిగి సహాయం చేయాలనే మీ సంకల్పానికి అభినందనలు తెలుపుతున్నానన్నారు.

పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శిరీష

కాళ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు తెలిపారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సరాబు పద్మారాణి, మన్నే నాగలక్ష్మి, సర్పంచ్ ల ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఎంపీడీఓ జి.స్వాతి, తహసీల్దార్ జి.సుందర్ సింగ్, హౌసింగ్ డీఈ శివరామరాజు, ఏఈలు టి.శ్రీనివాసరావు, జయప్రకాష్, ఫణిశంకర్, పి.రాంబాబు, ఎంఈవో రవీంద్ర, డాక్టర్లు ఎస్. సునీల్, చంద్రబాబు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లం కోడును ఆదుకోండి



పూడుకుపోయిన మల్లంకోడును చూపిస్తున్న రైతు నంద్యాల చల్లారావు

ఆకివీడు: మండలంలోని నాలుగైదు గ్రామాల ఆయుకట్టుకు మురుగునీరు ప్రవహించే మల్లం కోడు ఆక్రమణల్లో ఉందని ఆ ప్రాంత ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు చెప్పారు. అజ్జమూరు గ్రామం నుంచి ఏలూరుపాడు వరకూ సుమారు 8 కిలోమీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో ఉన్న డ్రెయిన్ పలుచోట్ల ఆక్రమణలకు గురైందన్నారు. ఆక్రమణలతో డ్రెయిన్ కుంచిచుకుపోయిందని, మురుగు నీరు బయటకు వెళ్లడం లేదని వాపోయారు. పలుచోట్ల పక్కా గృహాలు నిర్మాణం చేపట్టారన్నారు. మెరక భూములుగా ఉన్న అజ్జమూరు, కుప్పనపూడి, కాళ్లకూరు, ఏలూరుపాడు తదితర గ్రామాల పంట పొలాలు దుక్కి వర్షానికే ముంపుకు గురవుతున్నాయన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మీ కోసంలో ఫిర్యాదు కూడా చేసినట్లు చల్లారావు వివరించారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



వెంపలో విద్యుత్ నియంత్రణ మండలి కాపీలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.20 వేల కోట్ల భారాన్ని తక్షణం రద్దు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో సోమవారం విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల కాపీలను సీపీఎం నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ భరోసా ఇచ్చి నాలుగు నెలలకే చార్జీల మోత మోగించిందని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలో ఇంధన సర్దుబాటు ట్రూ అప్ చార్జీలు, సెస్సు చార్జీలు, స్మార్ట్ మీటరు నిర్ణయాన్ని, గతంలో వాడుకున్న విద్యుత్‌కు నేడు బిల్లులు వేసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తగ్గించడం మాని, 44 శాతం పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మందా మరియమ్మ, చిలకపాటి శకుంతల, కొండేటి కుమారి, బల్ల శకుంతల, ఇంజేటి మరియమ్మ, చిలకపాటి చిట్టి మాణిక్యం, వర్ధనపు మరియమ్మ, కాటికి వసంతరావు, కొండటి పున్నమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏనుగు సంబరం



ఏనుగు సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: బేతాళ సంబరం, ఏనుగు సంబరం 152 వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వేడుకగా ప్రారంభమయ్యాయి. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఏనుగు సంబరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక కళా నృత్య ప్రదర్శనలు కన్నుల పండుగగా జరిగాయి. బేతాళ స్వామిని ఏనుగు అంబారీ పై ఉంచి ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మేళ తాళాలు బాణ సంచా కాల్పుల మధ్య వివిధ కళారూపాల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. బేతాళ స్వామి ఊరేగింపు అత్యంత కన్నుల పండుగ వేడుకగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా వీరవాసరం ఎస్ఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సీనియర్ విద్యార్థిని గాయపర్చిన జూనియర్ విద్యార్థులు

భీమవరం: భీమవరం ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు కొట్లాటతో సోమవారం రాయలం గ్రామం ప్రాంతంలోని ప్రజలు భయ బ్రాంతులకు గురయ్యారు. కళాశాలలోని సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య గత కొంతకాలంగా గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో గొడవలను పరిష్కరించుకోడానికంటూ రాయలం గ్రామంలో సిటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ విద్యార్థి మేకా యశ్వంత్‌ను జూనియర్ విద్యార్థులు సీసాలతో కొట్టారు. విద్యార్థుల అరుపులు, కేకలతో కొట్లాటకు దిగడంతో ఆప్రాంతంలోని ప్రజలు ఎంజరుగుతుందో తెలియక భయబ్రాంతులకు గురై పరుగులు తీశారు. అనంతరం కొట్లాటలో గాయపడిని యశ్వంత్‌ను ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. యశ్వంత్‌ను జూనియర్ విద్యార్థులైన ఆసీఫ్ మరో నలుగురు కొట్టినట్లు అందిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టుటౌన్ ఎస్ఐ రెహమాన్ చెప్పారు.

మునిసిపల్ క్లాప్ డ్రైవర్ల సమ్మె విరమణ

భీమవరం: మునిసిపాల్టీలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్స్‌కు న్యాయం చేస్తామని కమిషనర్ కె రామచంద్రారెడ్డి హామీ ఇవ్వడంతో ఇరవై రోజులగా నిర్వహిస్తున్న సమ్మెను విరమించినట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు సోమవారం విలేకర్లకు తెలిపారు. క్లాప్ డ్రైవర్స్ జీతాలు విషయమై మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌తో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాతీయ నాయకుడు సుబ్బారాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు నెక్కంటి సుబ్బారావుతో కలసి చర్చలు జరపగా ఫలప్రథమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ చిలక రాజ్ కుమార్, రేవు వెంకటరమణ, జొన్నాడ శివ, చిలకపాటి దైవరాజు తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

ఉండి: గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉండి ఎస్సై నసీరుల్లా తెలిపారు. సోమవారం మండలంలోని పలువురు వ్యక్తులకు వివిధ ఫేక్ యాప్స్ నుంచి కాల్స్ రావడంతో వీటిని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సీబీఐ నుంచి కాల్ చేస్తున్నాం. మీ పిల్లలను డగ్స్ కేసులో అరెస్టు చేశాం. వారిని విడుదల చెయ్యాలంటే వెంటనే మీ ఫోన్‌పే లేదా గూగుల్‌పే ఓపెన్ చేసి మేము చెప్పినట్టు చేయండి అంటూ ఫోన్ కాల్స్ రావడం, బెదిరించారని ఓ బాధితుడు తెలిపారు. దీనిపై ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఫేక్ కాల్స్, మెస్సేజెస్, లింక్స్ ఎక్కువైపోయాయని ప్రజలు తప్పకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. దీనిపై మన దేశ ప్రధానమంత్రి కూడా దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ సందేశం పంపించారని తెలిపారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత కొద్ది రోజుల నుంచి మండల వ్యాప్తంగా ఆటో ప్రచారం నిర్వహించామని తెలిపారు. దయచేసి ప్రజలు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెస్సేజ్‌లు నమ్మవద్దన్నారు. ఆందోళన చెందకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొని అది మోసపూరితమైందని గమనించాలన్నారు. ఇటువంటి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే కాల్ కట్ చేసి, 1903 సైబర్ క్రైం నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి ఫేక్ ఫోన్‌కాల్స్‌ను ఆన్సర్ చేయొద్దని ఎస్సై తెలిపారు.

నేడు కొత్తపాలెంలో గ్రామసభ

మొగల్తూరు: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ సోమవారం తెలిపారు. గతంలో గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఏమైనా సమస్యలున్నా లేదా భూములకు సంబంధించి సమస్యలున్నా గ్రామ సభలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. తమకు అందిన ఫిర్యాదులను విచారించి భూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌లో 4 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 4 ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీ సుబ్బారావు సోమవారం చెప్పారు. స్థల సరిహద్దులు, సర్వేలు, మల్లం కోడు ఆక్రమణ తొలగింపు, అజ్జమూరు గ్రామంలోని కాళ్ల వెళ్లే రోడ్డులో ఆక్రమణలు తొలగించి, రోడ్డు మలుపు వద్ద జరిగే ప్రమాదాలను నివారించాలని గ్రామస్తుడు నంద్యాల చల్లారావు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు పనుల పరిశీలన

నరసాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నరసాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. సోమవారం సీతారామపురం సౌత్, రాజుగారితోట గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులను భీమవరం క్వాలిటీ కంట్రోల్ డీఈ గోవిందరాజు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ డీఈ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేది లేదన్నారు. కాంట్రాక్టర్లు వేగంగా పనులు చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో పాటించాలన్నారు. ఈయన వెంట పంచాయతీ రాజ్ డీఈ దొమ్మేటి సత్యనారాయణ, ఇన్‌చార్జి ఏఈ వై.నాగేశ్వరరావు, క్వాలిటీ కంట్రోల్ ఏఈ విశ్వనాధ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.